క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు వేంపల్లె శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 'ప్రకృతియే ఉత్తమ గురువు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుధవారం స్థానిక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని పీయూసీ-1, పీయూసీ-2 చదువుతున్న 400 మంది ఈ పోటీలలో పాల్గొనగా.. ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు మెమెంటోలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తాకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్, కో ఆర్డినేటర్ గోవర్థన్, సమితి సభ్యులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వీఎన్‌పల్లె ఎస్ఐగా వెంకటరెడ్డి



వీరపునాయునిపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా వెంకటరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కుల్లాయప్ప పదోన్నతిపై వెళ్లారు. కొవెలకుంట్ల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : మండలంలోని ఇప్పట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని.. మార్చి 10వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే



కమలాపురంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదేనని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ మస్తానయ్య, మాజీ సర్పంచ్ దేవదానం ఆధ్వర్యంలో బుధవారం 8వ వార్డులో, ఆర్‌వీఎస్‌ఆర్, కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో 4వ వార్డులో ఇంటింటికి తిరిగి జగనన్నకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. పథకాలన్నీ తిరిగి రావాలంటే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను తిరిగి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, సుదీర్, జంగంరెడ్డి, విశ్వం, బాబ్జీ, మధు, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, పవన్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఎస్‌టీబీఏ ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : స్థానిక రైల్వేస్టేషన్‌లో స్టేషన్ టికెట్ బుక్కింగ్ ఏజెంట్‌లను ఏర్పాటు చేయాలని డీఆర్ఎం వినీత్‌సింగ్‌కు డివిజనల్ రైల్వే సభ్యుడు వై.షామీర్‌బాషా బుధవారం గుంతకల్లులో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని కోరారు. దీనికి డీఆర్ఎం సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

క్రమశిక్షణ, నిబద్ధత ఉన్నత స్థానానికి సోపానాలు



వలంటీర్లకు బహుమతులను అందిస్తున్న ప్రిన్సిపాల్

వేంపల్లె : క్రమశిక్షణ, నిబద్ధత ఉన్నత స్థానానికి సోపానాలు అని.. ప్రతి ఒక్కరూ వాటిని అవలంబిస్తూ ఆదర్శంగా నిలవాలని వేంపల్లె వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని మదీనాపురం కాలనీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న వివిధ సేవా కార్యక్రమాల ముగింపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ ఓబుళరెడ్డి విద్యా వలంటీర్లు కలిసి ప్రత్యేక క్యాంపుల ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, ఆరోగ్యం, పర్యావరణం, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, ఆర్థిక సాధికారత, ప్రజల జీవన ప్రమాణాలు తదితర అంశాలపై అధ్యయనం చేసి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, పీహెచ్ సీ హెల్త్ ఎడ్యుకేటర్ బసవయ్య, ఉర్దూ పాఠశాల హెచ్ఎం కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో.. మహిళలకు పండుగ



కమలాపురంలో మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



పులివెందులలో చెక్కును డ్వాక్రా మహిళలకు అందిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

కమలాపురం : ఎన్నికల మెనిఫెస్టోను భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక సీఎస్ఐ చర్చి మైదానంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలకు ఆయన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 800 సంఘాలకు చెందిన 7551 మంది సభ్యులకు రూ. 6,53,29,250ల మెగా చెక్కును ఆయన లబ్ధిదారులకు అందజేశారు. నాలుగు విడతలుగా జగనన్న డ్వాక్రా మహిళలకు రూ.26.13 కోట్లు విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతా 80 లక్షల మంది మహిళామణులు వైఎస్సార్ ఆసరాను పండుగలా నిర్వహించుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ ఒక ఎత్తైతే, ఆసరా పథకం ఒక ఎత్తు అన్నారు. డ్వాక్రా, రైతు, బంగారు రుణాలు కట్టవద్దని టీడీపీ ప్రభుత్వం వచ్చాక తాము మాఫీ చేస్తామని దొంగ హామీలిచ్చిన చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారన్నారు. సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్నకు ఓటే వేసి తిరిగి సీఎం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భారతి, జడ్పీటీసీ సుమిత్రారెడ్డి, ఏసీ రఘునాథ్‌రెడ్డి, ఏపీ ఎం అపర్ణ, ఎంపీడీఓ జ్యోతి, కమిషనర్ రాముడు, మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, మస్తానయ్య, మహ్మద్ సాదిక్, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



వేంపల్లెలో డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న జెడ్పీటీసీ, మండల కన్వీనర్, ఎంపీపీ

అక్కాచెల్లెమ్మల ఆనందమే జగనన్న లక్ష్యం

పులివెందుల రూరల్ : అక్కాచెల్లెమ్మల ఆనందమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. బుధవారం పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉన్న శ్రీకర్ కల్యాణ మండపంలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల మున్సిపాలిటీలో 968 సంఘాలకు 9642 మంది డ్వాక్రా మహిళలకు రూ.38 కోట్లు మంజూరు చేశారన్నారు. డ్వాక్రా మహిళలకు రూ. 9.58 కోట్లకు పైబడిన నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు వారు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, జేసీఎస్ కన్వీనర్లు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, సీఎంఎం రాజేశ్వరి, మెప్మా సీఓలు నాయుడు, నాగేంద్ర, గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ శైలజ, కౌన్సిలర్ కోడి రమణ, డ్వాక్రా మహిళలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ ఉర్దూఘర్ షాదీఖానాలో ఎంపీడీఓ దివిజా సంపతి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు ఘనంగా జరిగాయి. అనంతరం పూర్తిగా రుణమాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. మండలంలో 987 డ్వాక్రా సంఘాలకుగానూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొత్తం రూ.40.25కోట్ల డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ రవీంద్రారెడ్డి, పులివెందుల ఏరియా కో.ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, భారతి, పద్మా జయలక్ష్మీదేవి పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టారని మార్కెట్ యార్డు చైర్మన్ పి.వి.రమణారెడ్డి, ఎంపీపీ కె.కె.సుధ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద 525 గ్రూపులకు రూ.4,21,66,453 విలువ గల మెగా చెక్కును మహిళా సంఘాల సభ్యులకు మార్కెట్ యార్డు చైర్మెన్, ఎంపీపీ అందజేశారు. అనంతరం సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. ఏపీఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో అరుంధతి, మండల కన్వీనర్ చవ్వా కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణ



ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డిని కలిసిన నూతన కమిషనర్ రామకృష్ణ

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నూతన మున్సిపల్ కమిషనర్‌గా రామకృష్ణ బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. గిద్దలూరు మున్సిపాలిటీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బదిలీపై వెళ్ళిన కమిషనర్ పి.జగన్నాథ్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా



కమిషనర్‌ను సన్మానిస్తున్న కిరణ్‌కుమార్

జమ్మలమడుగు : మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ ఎన్.ప్రమోద్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వచ్చే వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్యలేకుండా చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ 10వ వార్డు ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ ఆయనను సన్మానించారు.

విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టాడని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ఓబులంపల్లె, రామనపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రంతోపాటు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతులు సుభిక్షంగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న లక్ష్యంతోనే ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రైతు పంట మొదలుకుని రైతుకు గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ప్రభుత్వం అన్ని రకాల సేవలను అందిస్తోందన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సచివాలయాలతోనే సాధ్యమన్నారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ మాసీమబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ డైరెక్టర్ చల్ల వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ చల్లా ప్రమీల, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, మాజీ మండల ఉపాధ్యక్షుడు సొంటం చంద్రబాబురెడ్డి, ఎంపీటీసీ సుబ్బలక్షుమ్మ, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దారి నిర్మాణానికి భూమి పూజ

మండలంలోని ముండ్లపల్లె గ్రామపంచాయతీలో స్మశాన వాటిక దారి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశానికి దారిలేదని అక్కడి ప్రజలు తమదృష్టికి తీసుకురావడంతో జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.8 లక్షలు మంజూరు చేయించానన్నారు. రూ.4 లక్షలు స్మశాన దారికి, మరో రూ.4 లక్షలను గ్రామంలోని రహదారి పనులకు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ పనులు పది రోజుల్లో పూర్తి అవుతాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చినట్లైతే వెంటనే పరిష్కరిస్తానన్నారు.

ఉత్కంఠ భరితంగా బండలాగుడు పోటీలు

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లెలో నల్లమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీల్లో 17 జతల ఎద్దులు పాల్గొనగా ఈ పోటీలను ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డిలు ప్రారంభించారు. పోటీల్లో మాసనపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, సాకం బ్రహ్మానందరెడ్డి(కంబైన్స్) ఎద్దులు మొదటి బహుమతి, పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసుల్ రెడ్డి, చెంద్రాయుడు(కంబైన్స్) ఎద్దులు రెండవ బహుమతి, బెస్తవారిపల్లెకు చెందిన గాండ్లపల్లె జతిన్ విహాన్ ఎద్దులు మూడవ బహుమతి, బాలయ్యగారిపల్లె గ్రామానికి చెందిన దివిజారెడ్డి, చెంద్రాయుడు ఎద్దులు నాలుగవ బహుమతి సాధించాయి. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

చెన్నూరు : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ పాఠశాల విద్యా కమిటీ సమావేశంలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులనుద్దేశించి ఆయన మాట్లాడారు. గతంలో కన్నా ఇప్పుడు విద్యావ్యవస్థ ఒక మహోన్నత స్థితిలో ఉందని ప్రభుత్వం నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలల కన్నా ఎక్కువగా తీర్చిదిద్దారన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

చక్రాయపేట : గడప గడపకు సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాలని మండల వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. బుధవారం ఆయన మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని మళ్లీ జగనన్నను ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. శనివారం జరిగే వైఎస్‌ఆర్ ఆసరా కార్యక్రమానికి ఎంపీ అవినాష్‌రెడ్డి పాల్గొంటారని పార్టీ నేతలు హాజరు కావడమే కాకుండా కార్యక్రమాన్ని విజవంతం చేయాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్‌రెడ్డి, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలి


ఎర్రగుంట్ల : మండలంలోని అన్ని గ్రామాలలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ సభాభవనంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉపమండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు గ్రామాలలోని పలు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. వాటిని పరిష్కరించాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ కర్నూల్ జిల్లాకు బదిలీ కావడంతో ఘనంగా వీడ్కోలు సభను నిర్వహించారు. తాహసీల్దార్ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ రంహతుల్లయ్య, పొన్న శ్రీనులు, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీతోనే అన్ని వర్గాలకు ప్రయోజనం



తోల్లగంగనపల్లెలో ప్రచారంలో పాల్గొన్న వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

వల్లూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి మళ్లీ జగన్‌ను సీఎంగా చేసుకుందామని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. మండలంలోని తోల్లగంగనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని తోల్లగంగనపల్లె, నల్లపురెడ్డిపల్లె, ఎస్సీ కాలనీల్లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ రాజన్న, పార్టీ నేతలు చంద్రారెడ్డి, అయవారురెడ్డి, ఇందిరెడ్డి శంకర్ రెడ్డి, శివకుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజు కుళాయప్ప, బాబా, కరీముల్లా, విశ్వనాథరెడ్డి, ఓబుల్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ



నిరుపేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రతి నిరుపేదకు సొంతింటి కల సాకారం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పి.బొమ్మెపల్లిలో 34 మంది నిరుపేదలకు ఆయన ఇంటి పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. పొన్నతోట పంచాయతీ పరిధిలో ఇంటిస్థలాలు లేని వారికి పట్టాలతోపాటు ఇంటిని మంజూరు చేశామన్నారు. మంచి చేసిన వారికి ప్రజలు కూడా మద్దతు పలకాలన్నారు. తాను వైద్య వృత్తి నుంచి ప్రజలకు సేవ చేయడం కోసం రాజకీయాలలోకి వచ్చానన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అమర్నాథరెడ్డి, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



ఎగువపల్లెలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు సంతృప్తిగా అందుతున్నాయని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డిలు తెలిపారు. రంపతాడు, గొందిపల్లె గ్రామ పంచాయతీల్లో రెండు టీమ్‌లుగా ఏర్పడి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలను గెలిపించాలని పిలుపు నిచ్చారు. వ్యవసాయ సలహ మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, సంజీవ్ వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రా మాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, రామగంగిరెడ్డి, సుబ్బారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, విజయకు మార్‌రెడ్డి, సుబ్బయ్య, సిద్దారెడ్డి, నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన ఉండాలి

వీరపునాయునిపల్లె : మండలంలోని యు.రాజుపాలెం గ్రామంలో బుధవారం మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తికు ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. అనంతరం షరీఫ్, రామసుబ్బయ్య, నాగయ్య, గంగరాజు, లక్ష్మీదేవి, చంద్రతో మరికొంతమందికి పార్టీ కండువాలు వెసి పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న సురక్ష పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, కమలాపురం మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు వెంకటరామిరెడ్డి, మస్థాన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కిరణకుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దస్తగిరి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో సత్తా చాటిన నల్లచెరువుపల్లె మహిళా జట్టు

వేముల : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో మండలంలోని నల్లచెరువుపల్లె కబడ్డీ మహిళా జట్టు విజయం సాధించింది.

బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మైదుకూరు, నల్లచెరువుపల్లె జట్లు పోటీ పడ్డాయి. జిల్లా స్థాయి కబడ్డీలో నల్లచెరువుపల్లె మహిళా జట్టు విజయం సాధించడంపట్ల వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు అభినందనలు తెలిపారు. వీరు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలని వారు ఆకాంక్షించారు.

పులివెందుల తహసీల్దార్ బదిలీ

పులివెందుల టౌన్ : పులివెందుల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి నంద్యాలకు బదిలీ అయ్యారు.

పశువైద్య శిబిరానికి స్పందన

ఎర్రగుంట్ల : మండలంలోని కదిరివారిపల్లెలో ఎర్రగుంట్ల ఐసీఎల్ సిమెంట్ ఫ్యాక్టరీ వారిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఫ్యాక్టరీ హెడ్ నాగిరెడ్డి , మెడికల్ ఆఫిసర్ రాజామనోజ్ ఖన్నాలు తెలిపారు. పశువైద్య నిపుణులు వైద్యులు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫ్యాక్టరీ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

వేంపల్లె : ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పదవీ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంఈఓ వీరారెడ్డి, ఉపాధ్యాయుడు ఓబులేసులు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సంగమేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, రమణారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

